క్లుప్తంగా

రాగుల పంపిణీకి చర్యలు



గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ స్టాక్ పాయింట్‌కు చేరిన రాగుల బస్తాలు

గుమ్మలక్ష్మీపురం: బియ్యం కార్డుదారులకు రేషన్ సరుకులతో పాటు రాగులను సరఫరా చేయనున్నట్లు సివిల్ సప్లై అధికారులు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ స్టాక్ పాయింట్‌కు 7 టన్నుల రాగులను శనివారం పంపించారు. ఇప్పటివరకు కార్డుదారులకు చోడి పిండి ప్యాకెట్లను అందించారు. ఇకపై చోలు అందించనున్నట్లు జీసీఎంఎస్ అధికారులు తెలిపారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



,గుమ్మలక్ష్మీపురంలో విరాళాలు సేకరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: కేరళ వరద బాధితులకు సాయం అందించేందుకు గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంతో పాటు ఎల్విన్‌పేట గ్రామంలో శనివారం ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోరంగి గోపీనాథ్ ఆధ్వర్యంలో సభ్యులు విరాళాలు సేకరించారు. కష్టాల్లో ఉన్న బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని కోరారు. అన్ని మండలాల్లో విరాళాలు సేకరించి ఏక మొత్తంలో బాధితుల వద్దకు వెళ్లి అందజేయనున్నట్లు తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మవారి హుండీ కానుకలను శనివారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో హుండీలను తెరిచారు. భక్తులు, దేవాదాయ శాఖ అధికారులు సమక్షంలో లెక్కించారు. జూన్ 1 నుంచి ఈ నెల 3 వరకు 64 రోజులకు గాను రూ.9,40,899 ఆదాయం సమకూరింది. 850 గ్రాములు బంగారం, 700 గ్రాముల వెండితో పాటు అమెరికా డాలర్లు-2, బ్యాంక్ ఆఫ్ కొరియా 1000 ఓన్-1, కతర్ రియల్-1 చొప్పున వచ్చాయని ఈఓ తెలిపారు.

డ్రైనేజీల నిర్మాణం



కాలువలు నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

పాలకొండ రూరల్: మండలంలోని బాసూరు గ్రామంలో డ్రైనేజీల నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. వర్షాకాలంలో మురుగనీరు రోడ్లపై చేరి ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో స్థానిక సర్పంచ్ శిర్లాపు గురుమినాయుడు ఆధ్వర్యంలో శనివారం కాలువల నిర్మాణాలు చేపట్టారు. పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు, తాగునీటి వనరుల పరిరక్షణ, తదితర పనులపై దృష్టి సారించనున్నట్లు చెప్పారు. సచివాలయ సిబ్బంది సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



విద్యార్థుల ప్రమాణాలు పరిశీలిస్తున్న ఎంఈఓ సోంబాబు

పాలకొండ రూరల్: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని చేరుకునేందుకు కృషి చేయాలని ఎంఈఓ కురిటి సోంబాబు అన్నారు. వెలగవాడ ప్రభుత్వ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. మోనూ అమలుపై ఆరా తీశారు. తరగతుల వారీగా పిల్లలకు అందించిన విద్యాకిట్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలని ఇన్‌చార్జి హెచ్ఎం తిరుపతిరావుకు సూచించారు.

శ్రావణం.. శుభప్రదం

- రేపటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- ముస్తాబైన ఆలయాలు
- వ్రతాలు, నోములకు సిద్ధమవుతున్న మహిళలు



శ్రావణ మాస పూజలకు ముస్తాబైన వీరఘట్టం కోటదుర్గమ్మ ఆలయం (ఇన్‌సెట్లో) శ్రావణ లక్ష్మిగా ముస్తాబైన కోటదుర్గతల్లి (ఫైల్)

వీరఘట్టం:

హిందువులకు ఎంతో పవిత్రమైన శ్రావణ మాసం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మాసంలో చేసే పూజలు, వ్రతాలు, నోములు శుభ ఫలితాలను ఇస్తాయని భక్తుల విశ్వాసం. ఈ మాసంలో ప్రతీ ఇళ్లు ఆలయాన్ని తలపిస్తుంది. ఇదే నెలలో వరలక్ష్మీ వ్రతం, మంగళగౌరీ వ్రతం, నాగపంచమి, రాఖీ పౌర్ణమి, పోలాల అమావాస్య వంటి ముఖ్యమైన పండుగలు రావడంతో మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ నెల రోజుల పాటు ఆలయాలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంటుంది. హరి హర నామస్మరణతో ఆలయాలు మార్మోగనున్నాయి. ఇప్పటికే ఆలయాలు శ్రావణమాస పూజలకు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

ప్రతీ శుక్రవారం ప్రత్యేకమే..

పౌర్ణమినాడు చంద్రుడు శ్రవణా నక్షత్రం మీద సంచరించడం వల్ల ఈ మాసానికి శ్రావణం అనే పేరు వచ్చింది. ఈ నెలలో వచ్చే శుక్రవారాలను వ్రతాలకు, నోములకు కేటాయించడం వెనుక పెద్ద కథ ఉన్నట్లు పురణాలు చెపుతున్నాయి. కళియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి నక్షత్రం కూడా శ్రవణమే. కావున ఆయన భార్య లక్ష్మీదేవికి, సోదరి గౌరీదేవికి శ్రావణ శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తారు.

నోముల మాసం

పురోహితులు శ్రావణ మాసాన్ని నోముల మాసంగా లెక్కిస్తారు. శ్రావణంలో మంగళగౌరీ వ్రతం, వరలక్ష్మి వ్రతాలను ఆచరిస్తారు. ఈ మాసంలో వచ్చే ఏ మంగళవారం నాడు అయినా మంగళగౌరీ వ్రతాన్ని చేయవచ్చు. ఈ వ్రతాన్ని యువతులు పెళ్లైన తర్వాత ఏడాది వరకు ఆచరిస్తారు. వరలక్ష్మీ వ్రతాన్ని పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజు జరుపుకుంటారు. ఈ వ్రతాన్ని జీవితాంతం ఆచరిస్తారు. అయితే ఈ రెండు వ్రతాలు జరుపుకునే విధానం వేర్వేరుగా ఉంటాయి.

ముఖ్యమైన పండగలు

శ్రావణ మాసమంతా పండగల సందడి ఉంటుంది. ఈ నెల 9న తొలి శుక్రవారం, 11న భానుసప్తమి, 16న రెండో శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం, 19న రాఖీ పౌర్ణమి, జంద్యాల పౌర్ణమి, 26న శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి ముఖ్యమైన పండగలు ఉన్నాయి. శ్రావణ మాసం తరువాత వచ్చే భాద్రపద మాసంలో వినాయక చవితి సందడి మొదలవుతుంది.

30 రోజుల్లో 11 ముహూర్తాలు

శుక్ర మౌఢ్యం, ఆషాఢ మాసంతో 100 రోజుల బ్రేక్ తర్వాత ఈనెల 7 నుంచి 28 వరకు 11 ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణం మాసంలో వ్రతాలతో పాటు పెళ్లిళ్లు, గృహప్రవేశాలు వంటి శుభాకార్యాలకు మంచిదని ప్రజల నమ్మకం. ముఖ్యంగా ఆగస్టు నెలలో 7,8,9,11,15,17,18,19,22,23,28 తేదీలో పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. ఈ నెలలో జిల్లాలో వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయని పురోహితులు అంటున్నారు.



సామూహిక కుంకుమ పూజలకు వీలుగా సిద్ధం చేసిన మండపం

వ్రతాలు వెనుక ఆరోగ్య రహస్యాలు

పూజలు, వ్రతాలు, నోముల ఆచరించడంలో ఆరోగ్యపరమైన కారణాలు చాలా ఉన్నాయి. వరలక్ష్మి వ్రతం రోజు వాయనంగా ఇచ్చే మొలకెత్తిన శెనగలు పోషక నిలయాలు. వీటిలో మాంసకృత్తులు తక్షణ శక్తిని ఇస్తాయి. నైవేద్యంగా ఆరగించే చలివిడి చలువ చేస్తుంది. చలివిడి గర్భాధారణ అవరోధాలను తొలగిస్తుంది. అలాగే వర్షకాలం పాదాలు ఎక్కువ సేపు తడిగా ఉండటం వల్ల ఇన్‌ఫెక్షన్లు కలుగుతుంటాయి. ఇలా ఇన్‌ఫెక్షన్‌కు గురవ్వకుండా ఉండటం కోసమే కాళ్లకు పసుపు పూసుకోవటాన్ని ఈ వ్రతాల్లో భాగం చేసారు. ఆవు నెయ్యితో వెలిగించే దీపాల ద్వారా విడుదలయ్యే ధూపం వాయు కాలుష్యాన్ని హరిస్తుంది.

శ్రావణానికి ప్రత్యేక ప్రాధాన్యం



సకల సుఖాలను నొసగే శ్రావణం జ్ఞానాన్ని అందిస్తుంది. హరిహర భేదం లేదని నిరూపించే శ్రావణ మాసంలో వైష్ణవారాధనతో పాటు మహాశివునికి పెద్ద ఎత్తున రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా వివాహాది శుభకార్యాలకు శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు ఉన్నాయి.

– ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజి, యజ్ఞకర్త, వీరఘట్టం

29న మిగులు సీట్లకు కౌన్సెలింగ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 29న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.సునీల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 27న కళాశాలకు వచ్చి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. అనంతరం 27న ఉదయం 10 గంటలకు కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

1014 లీటర్ల సారా ధ్వంసం

సీతంపేట: పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు సమక్షంలో శనివారం 1014 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. 29 కేసుల్లో ముందుగా సీజ్ చేసిన వాటిని మద్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేసినట్లు చెప్పారు.

వీధి దీపాలకు మరమ్మతులు

సీతంపేట: సీతంపేటలో 96 సెంటర్ లైటింగ్‌ను మరమ్మతులు చేపట్టారు. స్థానిక వారపు సంత నుంచి ఐటీడీఏ వరకు ఉన్న ఎల్ఈడీ లైట్లు పాడవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతానికి 94 ఎల్ఈడీ లైట్లను బాగుచేశామని, మిగతా రెండింటిని త్వరలోనే బాగుచేస్తామని గ్రామ కార్యదర్శి సుదర్శనరావు తెలిపారు.

పోర్జాపైడీలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

సీతంపేట: పోర్జాపైడీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘ నాయకులు గేదెల చిరంజీవి, గొర్లె జీవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1950 రాజ్యాంగ ఆర్టికల్ 342 ప్రకారం గిరిజన తెగగా రాష్ట్రపతి ఆర్డర్ ద్వారా నోటిఫై అయిన పోర్జా పైడి కులాన్ని ఏపీ ప్రభుత్వం గిరిజన జాబితాలో చేర్చాలని కోరారు. దశాబ్దాలుగా ఎస్సీ కేటగిరిలో ఉన్న పైడి కులాన్ని ఆ జాబితా నుంచి తొలగించి గిరిజన జాబితాలో చేర్చినట్టయితే వారికి సమాజిక న్యాయం జరుగుతుందన్నారు.

గోగుసాగుపై తగ్గిన ఆసక్తి



గరుగుబిల్లిలో పండిస్తున్న గోగుపంట

గరుగుబిల్లి: గోగుసాగుపై రైతులకు గత కొన్నేళ్లుగా ఆసక్తి కనబరచడం లేదు. దీంతో ఏటా గోగుసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతోంది. ముఖ్యంగా విత్తనాలను సరఫరా చేయకపోవడం, ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేకపోవడం తదితర కారణాల వల్ల గోగు సాగుకు రైతులు ముందుకు రావడంలేదు. ప్రస్తుతం గోగు సాగుకు అయ్యే మదుపులు కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు. నారతీత సమయంలో కూలీల కొరత, మదుపులు అధికం కావడం, గిట్టుబాటు ధర లభించకపోవడం, జూట్ కార్పొరేషన్ నుంచి కూడా సరైన ప్రోత్సాహం లేకపోవడంతో ఈ పంట సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడంలేదు. మండలంలో 1150 ఎకరాలలో గోగుపంటను సాధారణంగా సాగుచేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనావేయగా కేవలం 500 ఎకరాలలోనే గోగుసాగు అవుతోందని అధికారులు చెపుతున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న సర్పంచ్, తదితరులు

పాలకొండ రూరల్: పర్యావరణ పరిరక్షణకు పచ్చదనాన్ని పెంపొందించాలని ఎం.సింగుపురం సర్పంచ్ రణస్థలం రమారంబాబు అన్నారు. ఉపాధి వేతనదారులతో కలిసి గ్రామంలోని కోనేటి వద్ద శనివారం కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఉపాధిహామీ పథకం, ఉద్యానవన శాఖల సమన్వయంతో పంచాయతీ పరిధిలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. పంచాయతీ కార్యదర్శి బి.సింహాచలం, సచివాలయ, ఎన్ఆర్ఐఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


సస్యరక్షణపై అవగాహన కల్పించాలి



కేవీకేలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు

గరుగుబిల్లి: రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయశాఖ సిబ్బంది కృషిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలతో జిల్లాలో సాగు చేస్తున్న పంటలు, వాటిని ఆశిస్తున్న తెగుళ్లు, నివారణ, అధిక దిగుబడులనిచ్చే వంగడాలపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ ఖరీఫ్‌లో ఎక్కువగా సాగవుతున్న వరి, మొక్కజొన్న, పత్తి, కంది పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై చర్చించారు. అలాగే కందిలో మేలైన రకాలు, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించాలని తీర్మానించారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ధ్రువ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలుద్దాం..



మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: దివ్యాంగులకు అన్ని స్థాయిల్లో అధికారులు అండగా నిలవాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. న్యాయస్థానం ప్రాంగణంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. దివ్యాంగుల హక్కులు, వాటికి భంగం కల్పిస్తే చట్టంలో ఉన్న శిక్షలపై సచివాలయ సిబ్బంది, దివ్యాంగులకు అవగాహన కల్పించారు. వివిధ స్థాయిల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని, ప్రజలకు సేవలు అందించే క్రమంలో స్నేహపూర్వకంగా నడచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పల్లా మునిస్వామి, మరిచర్ల జగన్మోహనరావు, తదితరులున్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

గరుగుబిల్లి: గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఎంపీడీఓ టి.సూర్యనారాయణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తాగునీటి బోర్లు, పంపుల వద్ద ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు, సిబ్బంది ఉన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..



కొమరాడ: మాజీ ఎంపీటీసీ గొర్రిల రవీంద్రను పరామర్శిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



పాలకొండ: బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

కొమరాడ: మండలంలోని మార్కొండపుట్టి గ్రామంలో మాజీ ఎంపీటీసీ గొర్రిల రవీంద్ర తండ్రి తవిటి నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శనివారం రవీంద్ర కుటుంబాన్ని పరామర్శించారు. తవిటినాయుడు మృతికి నివాళులర్పించారు. రవీంద్రను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన రావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, నాయకులు కళింగి మల్లేశ్వరరావు, పప్పల గోపాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

చినకుదుమలో..

జియ్యమ్మవలస: మండలంలోని చినకుదమ గ్రామానికి చెందిన నల్ల సాయికార్తీక నాయుడు ఇటీవల కర్నూలు ట్రిపుల్ ఐటీలో చదువుతూ మృతి చెందిన విషయం విధితమే. వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శనివారం పరామర్శించారు. ఆయనతో పాటు బలగ వెంకటరమణ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు జి.సంపత్‌కుమార్, లోలుగు నారాయణరావు, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పాలకొండ: నగర పంచాయతీలోని మండల వెంకటరమణ కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం పరామర్శించారు. ఇటీవల వెంకటరమణ భార్య మరణించడంతో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలాగే గులివిందల గడ్డిమినాయుడు ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారితో పాటు వైఎస్సాసీపీ నాయకులు దుప్పాడ పాపినాయుడు, వై.లిల్లీపుష్పనాథం, గణేష్, శాసపు రమణ, తదితరులు ఉన్నారు.

తవిటిరాజు మృతికి సంతాపం



పొట్నూరు తవిటి రాజు(ఫైల్)

వీరఘట్టం: వీరఘట్టంకు చెందిన వ్యాపారవేత్త, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రైస్ మిల్లర్ల సంఘం మాజీ ఉపాధ్యక్షుడు పొట్నూరు తవిటిరాజు(75) శనివారం మృతి చెందారు. శ్రీకాకుళం జిల్లా మురపాకలో ఇటీవల మృతి చెందిన ఓ మిత్రుని కుటుంబాన్ని పరామర్శించేందుకు కారులో వెళ్తుండగా పాలకొండ సమీపంలో గుండెపోటుకు గురయ్యారు. వెంటనే అతన్ని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు, పార్వతీపురం మన్యం జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు కొత్తకోట రమేష్ సంతాపం తెలిపారు.

అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్సై రాజేష్

సీతానగరం: విద్యార్థులు శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఎం. రాజేష్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్పీ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్స్ రవాణా, వినియోగంపై ఎటువంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎస్ఎస్ఎస్ పీఓలు పాల్గొన్నారు.

దోమల నివారణే లక్ష్యం

సీతానగరం: దోమల నివారణే లక్ష్యంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నామని ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ అన్నారు. మండలంలోని కాశీపేట, అప్పయ్యపేట గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సర్పంచ్‌ల సమక్షంలో మలాథియాన్ మందు పిచికారీ చేయిస్తున్నట్లు చెప్పారు.

తల్లిపాలు శ్రేష్టమైనవి



కొమరాడ: విక్రంపురంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు.. బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. తల్లిపాలు బిడ్డకు అమృతం వంటిదని, అప్పుడే పుట్టిన పిల్లలకు తప్పనిసరిగా ఆరు నెలల పాటు తల్లిపాలే ఇవ్వాలని, శిశువుకు అది సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తుందని, రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుందని తెలిపారు. ప్రతీ తల్లి తన బిడ్డకు పాలు ఇవ్వడాన్ని బాధ్యతగా భావించాలన్నారు.

– పాలకొండ, కురుపాం



గుమ్మలక్ష్మీపురం: భద్రగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు



పాలకొండ రూరల్: తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న వైద్యాధికారి రవికుమార్, ఐసీడీఎస్ అధికారులు

ముగిసిన పారిశుధ్య వారోత్సవాలు

పార్వతీపురం: జూలై 16వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పారిశుధ్య వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఇందులో భాగంగా గ్రామాల్లోని కాలువల్లో పూడికతీత పనులు, దోమల నివారణకు మలాథియాన్ పిచికారీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ, తదితరు వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు.